పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ఆయా శాఖల అధికారులు ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 65వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్, ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఈజిపి పథకం ద్వారా అర్హులైన వారి నుంచి నాణ్యతగల పథకాలను ఎంపికచేయాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 2 యూనిట్లకుగాను విద్యుత్ రాయితీలకు 29,777 రూపాయలు, వడ్డీ రాయితీ కింద 2 యూనిట్లకుగాను 2,37,142 రూపాయలు, పెట్టుబడి రాయితీ కింద 5 యూనిట్లకుగాను రూ.2,49,78,151, అమ్మకపు పన్ను రాయితీ కింద 1 యూనిట్‌కు రూ.28.85,711, స్టాంప్ డ్యూటీ రాయితీ కింద 1 యూనిట్‌కు రూ.1,02,235 సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఇంజినీరింగ్ పనులు జనవరిలోపు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెద్ద, మెగా ప్రాజెక్టులైన సోలార్, విండ్, నేషనల్ హైవే, రైల్వే, తదితర ప్రాజెక్టులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలన్నారు. ప్రాధాన్యత ప్రకారం భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఏపిఐఐసి పారిశ్రామికవాడలలో ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జెడ్ఎం ఏపిఐఐసిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎ.మలోల, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, లేబర్ డిసి లక్ష్మీ నరసయ్య, కమర్షియల్ ట్యాక్స్ ఏసిటీవో కృష్ణారెడ్డి, డిటిసి వీర్రాజు, మైన్స్ డిడి ఆదినారాయణ, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిఎస్‌డిఓ ప్రతాప్ రెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా మడకశిర

◆ 'అనంత, సత్యసాయిల్లో మార్పుల్లేవు

◆ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాల పునర్విభజనలో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో పెద్దగా మార్పులేవి లేనప్పటికీ మడకశిర అసెంబ్లీ నియోజకవర్గాన్ని కొత్త రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాటు చేశారు. అంతకు మునుపు ఈ డివిజన్ పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండింది. ఇప్పుడు మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడనున్నాయి. అంతకు మునుపు నాలుగు రెవెన్యూ డివిజన్లు ఉండేవి. ఇప్పుడు ఐదు రెవెన్యూ డివిజన్లుగా సత్యసాయి జిల్లా ఉండనుంది.

సత్యసాయి జిల్లాలో రెవెన్యూ డివిజన్లు మండలాల వారీగా ఇలా...

సత్యసాయి జిల్లాలో ఎటువంటి మార్పులేదు. కేవలం రెవెన్యూ డివిజన్లలోనే స్వల్ప మార్పులు చేపట్టారు. ఇందులోనూ పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోనున్న ఐదు మండలాలను మడకశిర కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలో భాగంగానున్న సత్యసాయి జిల్లా 2022లో సత్యసాయి జిల్లాగా ఏర్పాటైంది. అప్పుడు నాలుగు రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటైంది. ఇప్పుడు అది పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి, మడకశిర ఐదు రెవెన్యూ డివిజన్లు కానున్నాయి. ఇందులో పుట్టపర్తిలో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు ఆరు మండలాలతో రెవెన్యూ డివిజన్ కానుంది. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి ఏడు మండలాలు ఉండనున్నాయి. పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో పెనుకొండ, సోమందేపల్లి, పరిగి, గోరంట్ల, హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి, రొద్దం ఎనిమిది మండలాలు ఇక్కడ ఉంటాయి. కదిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో కదిరి, నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, ఎన్‌పికుంట, తలుపుల ఆరు మండలాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మడకశిర రెవెన్యూ డివిజన్ పరిధిలో మడకశిర, గుడిబండ, అమరాపురం, రొళ్ల, అగళి మండలాలుండనున్నాయి.

అనంతపురం జిల్లాలో మార్పులేదు..

అనంతపురం జిల్లాలో కొత్త పునర్విభజనలో ఎటువంటి మార్పుల్లేకుండానే యాధాతథంగా ఉంచారు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన పునర్విభజనను కొనసాగించారు. ముందున్న ప్రకారం అనంతపురం జిల్లాలో అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం మూడు రెవెన్యూ డివిజన్లే ఉన్నాయి. వీటిల్లో ఎటువంటి మార్పులేకపోవడంతో అనంతపురం జిల్లా మునుపటి దానిలో యధాతథంగానే కొనసాగనుంది.

రాయదుర్గం టెక్స్‌టైల్ పార్క్‌ను

అభివృద్ధి చేద్దాం : కలెక్టర్

కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయదుర్గం పరిధిలోని టెక్స్‌టైల్ పార్క్‌లో త్వరితగతిన గార్మెంట్ యూనిట్ల నిర్మాణం, ఇతర పనులను అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నాడు కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాయదుర్గం టెక్స్‌టైల్ పార్క్‌లో ఇదివరకే ప్లాట్లు పొంది నేటికీ యూనిట్ల నిర్మాణం చేపట్టని (47) మంది యూనిట్ హోల్డర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇది చివరి అవకాశంగా తెలియజేసి వారికి కేటాయించిన ప్లాట్లలో తక్షణమే యూనిట్లను నిర్మాణం చేసేలాగా జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ఇదివరకే అహుడా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న 23 మంది యూనిట్ హోల్డర్లను జనవరి మాసం చివరికల్లా అహుడా అనుమతులు పొందేలా, టెక్స్‌టైల్ పార్క్‌లో యూనిట్లను తమకు కేటాయించిన ప్లాట్లలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్స్‌టైల్ పార్క్‌లో ప్లాట్లు కేటాయించిన యూనిట్ల నిర్మాణానికి ముందుకు రాని వారికి చివరి విడత నోటీసుల ద్వారా తెలియజేసి ప్లాట్లను రద్దు చేయాలని ఆదేశించారు. రద్దు చేసిన ప్లాట్లను ఇదివరకే జిల్లా స్థాయి కమిటీలో ఆమోదం పొందిన ధరకు నూతన ఔత్సాహికులకు కేటాయించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పి.వరప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి టి.శ్రీనివాస్ యాదవ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్, హ్యాండ్లూమ్స్ అభివద్ధి అధికారి బసవరాజు, టెక్స్‌టైల్ పార్క్ యూనిట్ సభ్యులు డి.ప్రసాద్, చమ్మా ఇబ్రహీం పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు 'అనంత' ప్రాజెక్టులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జాతీయ స్థాయిలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తోన్న శాస్త్రీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు జిల్లాకు సంబంధించిన మూడు ప్రాజెక్టులు ఎంపిక కావడం విశేషం. గత మూడు రోజులుగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ ప్రాజెక్టుల ఎంపికలో దాదాపు 234 ప్రాజెక్టులు పాల్గొనగా జిల్లాకు చెందిన చీమలవాగుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లోకపావని, ప్రణతి ప్రదర్శించిన సౌరశక్తి ఆధారిత పిచికారీ యంత్రం మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి కోసం ఎంపిక చేసిన మూడు ప్రాజెక్టుల్లో మొదటి మూడు స్థానాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపిక కావడం విశేషం. మూడవ స్థానంలో గుత్తి ఆదర్శ పాఠశాల విద్యార్థులు మౌర్య శ్రీకారి, అంజుమ్ పర్వీన్ తయారు చేసిన వెహికల్ టు వెహికల్ కమ్యూనికేషన్ ఆన్ ది మూవ్ అనే ప్రాజెక్టు ఎంపికైంది. వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శైలజ, జిల్లా సైన్స్ అధికారి నరసింహారెడ్డి, తదితరులు అభినందించారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్‌అలీఖాన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవసరాన్ని మించి రసాయన ఎరువులను వాడుతున్నారన్నారు. తద్వారా భూమి తన సహజత్వాన్ని కోల్పోయి పంటల దిగుబడి తగ్గుతోందన్నారు. కావున రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. కాగా ప్రస్తుత రబీ సీజన్‌లో వరినాట్లు వేగంగా జరుగు తున్నాయన్నారు. మొక్కజొన్న కూడా 45 రోజుల పైరు దశలో ఉన్న నేపథ్యంలో సరిపడా యూరియాను రెండు రోజుల్లోగా రైతు సేవాకేంద్రాలకు చేరవేయనున్నట్లు తెలిపారు. తర్వాత పలు పంటల సాగుపై సలహాలు, సూచనలు అందించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రైతుకూలీలతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్, రైతు సేవాకేంద్ర ఇన్‌ఛార్జి తిరుమలేష్, రైతు వెంకట సుబ్బారెడ్డి, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అసలు..వడ్డీ కట్టాల్సిందే..

బంగారు రుణాల రెన్యువల్‌పై బ్యాంకర్ల ఆదేశాలు-అయోమయంలో రైతులు..చిరు వ్యాపారులు..

ఆత్మకూరులోని ఎస్‌బిఐ బ్యాంకు

ప్రజాశక్తి-ఆత్మకూరు

బ్యాంకుల్లో తనఖా పెట్టిన బంగారు రుణాలను వడ్డీతో సహా అసలు కట్టి రెన్యువల్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తుండటంతో రైతులు, పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలం కేంద్రంలో పంటల పెట్టుబడి కోసం సన్నకారు, చిన్నకారు రైతులతోపాటు చిన్నాచితక వ్యాపారాలు, కార్మికులు, కర్షకులు తమకున్న బంగారాన్ని బ్యాంకుల్లో తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నారు. అయితే సంవత్సరం తర్వాత వడ్డీ మాత్రం కట్టి రెన్యువల్ చేసుకునేవారు. లేదా పంటలు బాగా పండినా.. వ్యాపారాలు బాగా సాగినా తమ బంగారాన్ని విడిపించుకునేవారు. అయితే ఈసారి బ్యాంకు అధికారులు మాత్రం అలాంటి అవకాశం లేకుండా పోయారు. ఎట్టి పరిస్థితుల్లో డబ్బు మొత్తం కట్టి బంగారం తీసుకుని తిరిగి రెన్యువల్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సన్నకారు, చిన్నకారు రైతులు, చిన్న చిన్న వ్యాపారాలు, కార్మికులు, కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే పంటలు పండక రైతులు.. వ్యాపారాలు జరగక వ్యాపారులు.. పనులు లేక కార్మికులు, కర్షకులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. దీనికితోడు స్వయానా ప్రభుత్వమే ఆత్మకూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. ఈనేపథ్యంలో డబ్బులు మొత్తం కట్టి ఎలా రెన్యువల్ చేసుకోగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో పేదల అవసరాలు.. ఇబ్బందులను అవకాశంగా భావిస్తున్న కొంతమంది పెట్టుబడిదారులు బ్యాంకు వద్ద ఉంటూ బంగారుకు సంబంధించిన మొత్తాన్ని కట్టించుకుని అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. చేసేది లేక వారు ఎంత అడిగితే అంత కిమ్మనకుండా కట్టి ఉసూరుమంటూ వస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు.. అధికారులు స్పందించి వడ్డీ మాత్రమే కట్టించుకుని బంగారు రుణాలను రెన్యువల్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వల్లి జశ్వంత్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వల్లి జశ్వంత్ తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎస్‌సి బాలుర వసతి గృహంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56ఏళ్లలో విద్యార్థుల సమస్యలపై అనుక్షణం పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థి ఉద్యమ పోరాటాల్లో అనేకమంది నాయకులు అసువులు బాసారన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ విద్య అందే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో విద్య కాశాయీకరణ, ప్రయివేటీకరణ జరుగుతోందన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం విద్యా విధానాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్య అందించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేటీకరణ ముసుగులో కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇచ్చి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ విద్య, నాణ్యమైన భోజన సదుపాయం కల్పించేంత వరకూ ఎస్ఎఫ్ఐ అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ నాయకులు, గౌతమ్ ఈరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అప్రమత్తత అవసరం

ఐసిడిఎస్ పీడీ అరుణకుమారి

నూతన మొబైల్ ఫోన్లను చూపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారించేందుకు చర్యలు చేపట్టాని ఐసిడిఎస్ పీడీ అరుణకుమారిసూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎర్రితాత స్వామి ఆలయ ఆవరణలో బాల్య వివాహాలపై అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలను అనంతపురంలోని జిజిహెచ్, ఎన్ఆర్‌సిలకు తరలించి 14 రోజుల పోషకాహారం అందించేందుకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని అంగన్వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సిఎల్ డిపిఓ ఎన్.శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టిడిపి నాయకులు మల్లికార్జున, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు .

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా ఉందని.. అలాకాకుండా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 4,950 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని కో ఆపరేటివ్ సొసైటీలు, ఆర్ఎస్‌కెలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్, హోల్‌సేల్, కంపెనీ గోదాములకు తరలించామన్నారు. జిల్లాలో రబీ 2025-26 సీజన్‌కుగాను అన్ని పంటలకు అవసరమైన 27,232 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక చేయగా అక్టోబర్ 1వతేదీనాటికి 3,610 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభ నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అప్పటి నుంచి డిసెంబర్ 31వతేదీ వరకూ జిల్లాకు 13,321 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, ఇప్పటికే 20,729 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. 13,325 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, ప్రస్తుతం 4,950 మెట్రిక్ టన్నుల యూరియా ఆయా సొసైటీల్లో ఉందన్నారు. దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు యూరియాను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. దీనికితోడు విదేశాల నుంచి కూడా యూరియా దిగుమతులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కావున రాబోయే పంటకాలంలో యూరియాకు ఎలాంటి కొరత రాదన్నారు. ఇకపోతే నూతనంగా రూపొందించి సాంకేతికంగా అభివృద్ధి చేసిన నానో యూరియా, నానో డిఎపిలను కూడా రైతులు ప్రత్యామ్నాయంగా వాడాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-గుంతకల్లు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఈనెల 31వతేదీ రాత్రి ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేసినట్లు 1, 2వ పట్టణ సిఐ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వతేదీ రాత్రి పట్టణ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కావున నూతన సంవత్సర వేడుకలు నిబంధనల మేరకే నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే అలాంటి వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కోయడం, బాణసంచా పేల్చడం, డిజెలు పెట్టుకుని గుంపులుగా చేరి అల్లరి చేయడం వంటి వాటికి అనుమతులు లేవన్నారు. సంప్రదాయమైన కార్యక్రమాలకు మాత్రమే ముందుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు అనుమతుల మేరకు తెరిచి ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి సంబరాలు చేసుకోవడం, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి నడపడంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి కేసులు నమోదు చేసి, ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. మైనర్లు వాహనాలు తీసుకుని రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవన్నారు. పట్టణ ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.

మద్యం దుకాణాలను బంద్ చేయించాలి

ఐద్వా ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిఐకి వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

డిసెంబర్ 31, జనవరి 1తేదీన రెండు రోజులపాటు పట్టణంలోని మద్యం దుకాణాలను బంద్ చేయించాలని ఐద్వా మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎక్సైజ్ సిఐ శివసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా డిసెంబర్ 31, జనవరి 1న మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గత అనుభవాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా యువత అధికంగా మద్యం తాగి రోడ్డుపై అసభ్యకరంగా ప్రవరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కావున రెండు రోజులపాటు మద్యం షాపులను మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాలు సుగుణ, షాకీరా, సరస్వతి, ప్రభావతి, భాగ్యమ్మ, రెడ్డమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, హమాలీలు

ప్రజాశక్తి-అనంతపురం

విశాఖపట్నంలో ఈనెల 31వతేదీ నుంచి నిర్వహించనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం కందుకూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థలో పని హమాలీ కార్మికులతో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యానంతరం కార్మికవర్గం ఎన్నడూ లేనంతగా తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక ఉద్యమాలను అణిచివేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులకు సంబంధించిన ఏఒక్క సమస్యను పరిష్కరించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఓవైపు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే.. జీతాలు మాత్రం పాతాళంలో ఉన్నాయన్నారు. మరోవైపు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ల ఆస్తులు వందల రెట్లు పెరుగుతుంటే దేశంలో అసమానతలు, పేదరికం, నిరుద్యోగం ఎన్నడూ లేనంత స్థాయికి దిగజారిందన్నారు. ముఖ్యంగా కార్మికవర్గం అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాశనం చేసిందన్నారు. కార్మికవర్గ అనుకూల విధానాలను అమలు చేయించడానికి పాలకవర్గంపై ఒత్తిడి పెంచడం కోసం అఖిల భారత మహాసభల్లో సమర శంఖారావం పూరించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ మేస్త్రీ గోపాల్, ఆదినారాయణ, నాగరాజు, రామ్మోహన్, ఎర్రిస్వామి, పోతులయ్య, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగ్ గేట్ మూసివేత

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని రాయలచెరువు రైల్వే క్రాసింగ్ గేట్ నెం.171 వద్ద అత్యవసర మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఐదు రోజుల పాటు మూసివేయనున్నట్లు తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే కిలోమీటర్ 390/20-24 డిఎన్/ఎల్ వద్ద ఉన్న ఈలెవల్ క్రాసింగ్ గేట్‌కు రోడ్డు, ట్రాక్ నిర్వహణ పనులు చేయాల్సి ఉండటంతో వచ్చే సంవత్సరం జనవరి 2 నుంచి 6వతేదీ వరకూ గేట్‌ను మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఈమధ్యకాలంలోవాహనదారులు రాయలచెరువు-వేములపాడు-పెద్దపేట బైపాస్ రోడ్డు మీదుగా ప్రయాణించాలని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయం సూచించినట్లు తెలిపారు.

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంతకల్లు

యుటిఎఫ్ పట్టణ, మండల యూనియన్లు రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీని మంగళవారం మండల విద్యాధికారి కార్యాలయం ప్రాంగణంలో మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రవిబాబు, శంకరయ్య, రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా పని చేస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల కోసం సంఘం రాజలేని పోరాటాలు చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సంఘం వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఎన్.తిమ్మాపురం ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాధాకృష్ణ, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సరోజినీనాయుడు మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రవిబాబు, డిబిఎన్ మున్సిపల్ ప్రధానోపాధ్యాయులు రవికుమార్, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాజకుమార్, జిల్లా కౌన్సిలర్ రవిప్రసాద్, మండల మహిళా విభాగ కన్వీనర్ కల్పన, మహిళా ఉపాధ్యాయినులు మాధవి, సరిత, యుటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షులు యల్లన్న, ప్రధాన కార్యదర్శి రమేష్, మండల శాఖ అధ్యక్షులు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, మండల నాయకులు సుధాకర్, చంద్రశేఖర్, రంగన్న, అబ్దుల్ రఫీ, వరప్రసాద్, వెంకోబ్, విశ్వేశ్వరబాబు, పెద్దయ్య, మురళీమోహన్‌రాజు, కృపామనాయుడు, చరణ్‌తేజ్, తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత కుటుంబ సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో వచ్చేనెలలో చేపడుతున్న ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే)కు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు బయోమెట్రిక్ ఈకేవైసీ పెండింగ్ ఉండటం వల్ల అనేకమంది ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోతున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఏకీకృత కుటుంబ సర్వేను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా వాట్సప్ గవర్నెన్స్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 200 రకాల సేవలను ప్రజల ఇంటి ముందుకే తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో జనవరి నెలాఖరులోగా కుటుంబ ఏకీకృత సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సచివాలయ సిబ్బంది ప్రజల వద్దకు వచ్చి అవసరమైన సమాచారం సేకరిస్తారన్నారు. ఇంటి వద్దకు వచ్చిన సర్వే సిబ్బందికి సిటిజన్, ఇకెవైసి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సహకరించాలని కోరారు. ఈకేవైసీ చేయడానికి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, సర్టిఫికెట్లు మొబైల్ నెంబర్, వృత్తిపరమైన వివరాలు సర్వేకు వచ్చిన సిబ్బందికి అందజేయాలన్నారు. సర్వే సందర్భంగా బయోమెట్రిక్ పడకపోతే సమీపంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లి ఫొటో ఐరీష్ అప్‌డేట్ చేయించాలని కోరారు.

బదిలీ డీసీకి సన్మానం

పావనిని సన్మానిస్తున్న కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న డిప్యూటీ కమిషనర్ పావనిని మంగళవారం నగరంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది వేర్వేరుగా శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమానికి హాజరైన కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ పావని డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. కమిషనర్‌గా కూడా వివాదాలకు తావు లేకుండా బాధ్యతలు నిర్వహించి మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్, ఇఇ చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫీసర్ దేవశంకర్, ఇంజినీరింగ్ అధికారులు, ఆర్ఐలు, రెవెన్యూ గుమస్తాలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిణికి సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యవసాయ అధికారిణిని సన్మానిస్తున్న ఉద్యోగులు

త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఉమామహేశ్వరమ్మ పలువురి రైతులు, ప్రజాప్రతినిధుల మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, తాడిపత్రి ఎడిఎ మీనల రవి, మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, ఎపి సీడ్స్ మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటరాముడు, వాసుప్రకాష్, వెంకటకుమార్, జిఎం.అల్తాఫ్ అలీఖాన్, సుంకర, ప్రతాప్, రాకేష్‌నాయక్, ఎఫ్‌సిఐ ల్యాబ్ ఎడిఎ హైమావతి, ఎరువుల డీలర్ల సంఘం అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సిరుగుప్ప వెంకటేష్, సురేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ మినిస్టీరియల్ సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కార్యదర్శి బాలాజీనాయక్, నరసింహులు సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, రహంతుల్లా, ఎఇఒల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరులో చెరువులన్నీ నింపుతాం

ప్రజాశక్తి-పుట్లూరు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలతో మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులను నింపుతామని టిడిపి నాయకులు కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె చిన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎల్‌కె చెన్నారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా సుబ్బరాయుడు సాగర్‌కు 11:30 మీటర్ల నీటిని నింపినట్లు తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు గేట్లు మొరాయించడంతో నీరంతా వృథాగా పోయిందన్నారు. గత ప్రభుత్వం గేట్లను మరమ్మత్తు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదన్నారు. ప్రస్తుతం గేట్లు మొరాయించడంతో కర్ణాటక నుంచి నిపుణులను పిలిపించి గేట్లను మరమ్మతులు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అయినా ఎమ్మెల్యే చొరవ తీసుకుని సుబ్బరాయుడు సాగర్‌కు నీటిని నడిపిస్తుందన్నారు. గత సోమవారం పులివెందుల బ్రాంచ్ కాలువకు రైతులు వచ్చి నీటిని తరలిస్తుంటే ఎమ్మెల్యే స్వయానా కలెక్టర్, ఎస్‌సి దృష్టికి తీసుకెళ్లి నీరు తరలించకుండా చర్యలు చేపట్టారన్నారు. రైతులు ఎవరూ నిరుత్సాహ పడొద్దని తప్పనిసరిగా మండలంలోని చెరువులను నీటితో నింపుతామని భరోసా ఇచ్చారు. ఈసమావేశంలో రైతులు వెంకటరాముడు, మల్లికార్జునరెడ్డి, రమేష్‌రెడ్డి, కోమటికుంట్ల జనార్ధనరెడ్డి, వెంకటనాయుడు, జయచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దండు శ్రీనివాసులుకు సన్మానం

ప్రజాశక్తి-శింగనమల



దండు శ్రీనివాసులును సన్మానిస్తున్న బలిజ సంఘం నేతలు

అనంతపురంలోని శ్రీనివాస్‌నగర్‌లో శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులును రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షులు బళ్లారి వెంకటరాముడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీనివాసనగర్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దండు శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులుకు బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ మహాసంఘం నాయకులు విజయభాస్కర్, కోనేటి సాయిప్రసాద్, ప్రభాకర్, మధుసూదన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబ సభ్యులకే అవకాశం ఇవ్వాలి

వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, అధికారులు

ఆప్కోస్ విధానంలో దశాబ్దకాలంగా మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆర్.పవన్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ సమావేశ భవనంలో ఛైర్‌పర్సన్ నంగినేని భవాని అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలో పొందుపర్చాల్సిన అంశాలపై కౌన్సిలర్లతో చర్చించారు. ఆప్కోస్ విధానంలో మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన పారిశుధ్య కార్మికులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన వారి స్థానంలో ఇతరుల నియామకంపై వైస్ ఛైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దశాబ్దాల కాలంగా పారిశుధ్య పనులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారన్నారు. అయితే వారి స్థానంలో ఎమ్మెల్యే ప్రతిపాదించిన ఆరుగురు కార్మికులను తీసుకునేందుకు కౌన్సిల్ తీర్మానం కోరడం సరైంది కాదన్నారు. అంతేగాకుండా ఆయా నియామకాలపై అవినీతి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఉద్యోగ విరమణ పొందిన అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు ఉండవన్నారు. పెన్షన్ కూడా రాదన్నారు. కావున మానవతా దృక్పథంతో వారి కుటుంబ సభ్యులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని సూచించారు. ఆ నియామకంపై అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వైస్ ఛైర్‌పర్సన్ తెలిపారు. ఇకపోతే పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. తమ పదవీ కాలం ఇక మూడు నెలలే ఉందని.. ఈ సమయంలో తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలని కౌన్సిలర్లు లింగన్న, నాగరత్న, విద్యారాణి తదితరులు కోరారు. టెండర్లు వేసి పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని అనేక కౌన్సిల్ సమావేశాల్లో చెప్పిన ఎందుకు చేయడం లేదని కౌన్సిలర్ కృపాకర్ మండిపడ్డారు. రాత్రి వేళల్లో పారిశుధ్య పనులకు 40 మంది కార్మికులను తీసుకున్నామని చెబుతున్నారని.. అయితే అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కేవలం 20 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. మిగిలిన 20 మంది కార్మికుల వేతనాలను ఎవరు బొక్కేస్తున్నారని పవన్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కౌన్సిలర్లకు మూడు నెలల గౌరవ వేతనం ఇవ్వలేని దుస్థితిలో మున్సిపాలిటీ ఉందని.. ఇది సిగ్గుచేటని మెజార్టీ కౌన్సిలర్లు మండిపడ్డారు. అనంతరం అవుట్‌సోర్సింగ్ కార్మికుల నియామకం అంశం మినహా అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు వైస్ ఛైర్‌పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ నయీమ్‌అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, మేనేజర్ రాధ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ అలీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ సాయిలక్ష్మి, మెప్మా టిపిఆర్ఓ మోహన్, డిఇ షబానాభాను, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావానికి దక్కిన గౌరవం

ప్రజాశక్తి-అనంతపురం

ఆదరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా..

పిఒడిటిటి త్యాగరాజు

డిఎంహెచ్ఒతో పురస్కారం అందుకుంటున్న పిఒడిటిటి త్యాగరాజు (పాతచిత్రం)

వృత్తిలో అంకితభావం ఎంత గొప్పదో అంతకుమించి సహ ఉద్యోగులు, ఉన్నతాధికారుల సహకారం.. ఆదరణ అంత గొప్పదని జిల్లా వైద్య శాఖ కార్యాలయం ప్రాజెక్ట్ కార్యాలయం జిల్లా ట్రైనింగ్ టీం ఆఫీసర్ ఎం.త్యాగరాజు అన్నారు. డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ప్రజాశక్తితో తన మనోభావాలను పంచుకున్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నట్లు చెప్పారు. అయితే కుటుంబం తనకు అండ.. మిత్రులు, సహోద్యోగులు.. ఉన్నతాధికారుల ప్రోత్సాహం.. చేయూత.. తనకున్న అంకిత భావం.. మనోభావాలు తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయన్నారు. దీర్ఘమైన 43 సంవత్సరాల 8 నెలల మూడు రోజుల తన ఉద్యోగ జీవితకాలంలో అనేక సమస్యలు అధిగమించి అంకితభావంతో వృత్తిలో నైపుణ్యతను పెంచుకుంటూ ప్రజలకు సేవలు అందించినట్లు చెప్పారు. తీసుకుంటున్న జీతానికి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తన బాధ్యతను ఎక్కడా లోపం జరగకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు నడిచానన్నారు. సుదీర్ఘమైన పయనంలో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన వ్యక్తుల్లో తమ తండ్రి ఓబులేసప్ప, తల్లి లక్ష్మీదేవి, సోదరుడు రామకృష్ణ, ఇతర సోదరులు, అక్క చెల్లెల పాత్ర కీలకమైందన్నారు. 1982 మార్చి 29న హెల్త్ అసిస్టెంట్‌గా ప్రారంభమైన తన ఉద్యోగం జీవితం సూపర్‌వైజర్‌గా, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా, డిప్యూటీ డెమో అధికారిగా, హెచ్ఇఐఒగా, పిఒడిటిటి అధికారిగా ముందుకు సాగిందన్నారు. అందరి సహకారంతో ఎంతోమంది మన్ననలు పొందడంతో పాటు పలు అవార్డులు సాధించడం సంతోషకరమైందన్నారు. ప్రధానంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ భ్రమరాంబాదేవి అందించిన ప్రోత్సాహం తనను మరింత ముందుకు నడిపిందన్నారు. భవిష్యత్తులో తమ వంతుగా సామాజిక సేవా కార్యక్రమాలు చైతన్య కార్యక్రమాల్లో పాలు పంచుకుంటానన్నారు.

నూతన భవన నిర్మాణంపై నిర్లక్ష్యమెందుకో..

మున్సిపల్ మీట్‌లో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గుత్తి

సమస్యలపై ప్రశ్నిస్తున్న మున్సిపల్ సభ్యులు

ఏళ్లు గడుస్తున్నా మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించకుండా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఎన్.ఫారూఖ్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. తమ వార్డులో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు రహదారులపై ప్రవహిస్తోందని కౌన్సిలర్ రమణ అన్నారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పేరుకు పోతుందన్నారు. ఐదవ వార్డులో ఇటీవల నిర్మించిన సిసి రహదారిని ప్రయివేటు కేబుల్ నెట్ వర్క్ సంస్థ త్రవ్వకాలు సాగించిందని కౌన్సిలర్ ఖాజాఖాన్ అన్నారు. తవ్వకాల అనంతరం గుంతలను పూడ్చకుండ వదిలేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత సిపిఐ కాలనీలో తాగునీటి పైపులైను లీకేజీ అయ్యి మురుగు నీటితో కలుషితం అవుతుందని కౌన్సిలర్ వాల్మీకి శివ సమావేశం దృష్టికి తెచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏ వార్డుల్లో పనులు చేశారో వివరాలు చెప్పాలని వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారాన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, డిఇఒ హేమచంద్రకుమార్, ఎఇ గోవిందప్ప, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పి.మహబూబ్‌బాషా, మెప్మా సిఇఒ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములపై ప్రత్యేక గౌరవం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీలు

ముస్లిం మైనార్టీలపై ముఖ్యమంత్రి సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకమైన గౌరవం ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఇటీవల టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నియమితులైన షామీర్‌తో పాటు పలువురు ముస్లిము నాయకులు మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందు నుంచి ప్రతి ఏటా ముస్లిములకు రంజాన్ కానుకలు, విందులు, ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అంతేగాకుండా ముస్లిములకు రావాల్సిన అన్నిరకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ముస్లిములు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కాగా ఎంఎస్ఎంఇ ఛైర్మన్ చౌడికృష్ణ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

యుటిఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

వివిధ ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. యుటిఎఫ్ నాయకులు ఈశ్వరయ్య, రాజేంద్ర, మారుతితోపాటు ఇతర ఉపాధ్యాయులు క్యాలెండర్ల ఆవిష్కరణలో పాల్గొన్నారు. అదేవిధంగా ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను కూడా ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాతిరెడ్డి, గోవర్ధన్, ఆక్కులప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరికి అభినందనలు

ప్రజాశక్తి-కూడేరు

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముచ్చటగా మూడోసారి నియమితులైన శ్రీధర్‌చౌదరికి మంగళవారం ఆయన స్వగృహంలో విహెచ్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న మాట్లాడుతూ టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారిగా ఎన్నికవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు విజయ్, మండల ఉపాధ్యక్షులు కమ్మూరు రాము, విహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు కలగళ్ల ముత్యాలు, మాల మహానాడు జిల్లా నాయకుడు పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ మార్క్సిస్ట్ (సిపిఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం గణేనాయక్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ఏజెండాగా సమ సమాజ స్థాపనే లక్ష్యంగా సిపిఎం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. సంవత్సర కాలంలో చేపట్టిన పోరాటాల చిత్రాలు, చైతన్యవంతమైన సందేశాత్మక అంశాలతో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించి ఆవిష్కరించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, జిల్లా కమిటి సభ్యులు ముత్తుజ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్ మసూద్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, నాయకులు లక్ష్మినరసమ్మ, అశ్విని, ఎర్రిస్వామి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-యల్లనూరు

డిసెంబర్ 31వతేదీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎవరైనా ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నూతన సంవత్సరం వేళ ఎలాంటి అవాంతరాలు లేకుండా చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఎవరైనా మద్యం తాగి అర్ధరాత్రి వరకూ రోడ్లపై సంచరిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను తొలగించి ప్రజల ప్రశాంతతను భగ్నం చేయొద్దన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ సాగర్

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సాగర్ మంగళవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా, నిస్వార్థంగా వార్తల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తూ బడుగు, బలహీన వర్గాల పత్రికగా అందరి మన్ననలు పొందడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది సుంకన్న, హరినాథ్‌రెడ్డి, గౌస్, హరినాథ్‌రెడ్డి, అమర్, ప్రజాశక్తి పాత్రికేయుడు షేర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌గా అంజయ్య బాధ్యతల స్వీకరణ

కమిషనర్‌కు బొకే అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా అంజయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కమిషనర్ బాలస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తర్వాత జాయినింగ్ రిపోర్టు చేశారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని మహిళ మృతి

మృతిచెందిన గుర్తు తెలియని మహిళ

గుత్తి : మండలంలోని కొత్తపేట-ఎంగిలిబండ గ్రామాల మధ్య 67వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సిఐ ఎం.రామారావు, ఎస్ఐ కె.సురేష్ తెలిపిన వివరాల మేరకు.. గుర్తుతెలియని మహిళ (58) యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగేంచేదు. ఇందులో భాగంగానే రహదారి వెంబడి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. ఆ మహిళను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. ఆచూకీ తెలిసినవారు తమకు తెలియజేయాలని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

హితాక్షి (పాతచిత్రం)

శెట్టూరు : కళ్యాణదుర్గం మండల పరిధిలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో మంగళవారం నీటితొట్టిలో పడి చిన్నారి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు కోడిపల్లికి చెందిన రామాంజినేయులు, అశ్వినికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఆఖరి కుమార్తె హితాక్షిశ్రీ (2) ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడింది. గమణించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు

32 ద్విచక్ర వాహనాలు స్వాధీనం : డీఎస్పీ రవిబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేయడంతోపాటు రూ.22.80 లక్షల విలువజేసే 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐలు హరినాథ్, నీలకంఠేశ్వరతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కుందుర్పి మండలం బోదపల్లికి చెందిన బోయ పాతన్న (ఎనుములదొడ్డి గ్రామ పంచాయతీ), అనంతపురం మండలం పాపంపేటకు చెందిన బోయ చిన్నబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నాటకాలోని పావగడ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగలించినట్లు తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టగా ద్విచక్ర వాహనాల చోరీ ఘటనలు బహిర్గతం అయ్యాయన్నారు. ఇందులో భాగంగా నిందితులను కుందుర్పి రోడ్డులోని బ్రహ్మయ్యస్వామి ఆలయం వద్ద అరెస్టు చేసి 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

అక్రమ కేసులు పెడితే బయట ఉండేవారు కాదు..-ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అందరినీ ప్రత్యేకంగా అభినందిస్తూ..కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం పార్లమెంటు పరిధిలో అగ్రస్థానంలో నిలిపారన్నారు. అలాగే సూపర్ సిక్స్ - హిట్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేశారన్నారు. ఏ కార్యక్రమాన్ని పార్టీ ఆదేశించినా.. అర్బన్ నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు దిగ్విజయం చేస్తున్నారన్నారు. అలాగే సభ్యత్వ నమోదులో చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఒక రికార్డు సృష్టించారన్నారు పార్టీ కోసం పని చేస్తున్న ఏ ఒక్కరినీ విస్మరించమని.. వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. మనకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్ అని ఎమ్మెల్యే అన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీలు మనమే విజయం సాధించాలన్నారు. కనీసం వైసిపి వారు నామినేషన్ వేయాలంటేనే ప్రజలు ఒప్పుకోరు అన్న విధంగా మన ప్రచార కార్యక్రమాలు ఉండాలన్నారు. ఈ 18 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటినుంచే ఒక ప్రణాళిక ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కష్టపడాలని ఎమ్మెల్యే సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మేము అక్రమ కేసులు పెట్టి ఉంటే.. ఈరోజు ఒక్క వైసీపీ నాయకుడు కూడా బయట ఉండేవారు కాదని స్పష్టం చేశారు.

కార్పొరేటర్లు.. వీధి రౌడీలు..

నగరంలోని గుల్జార్‌పేటలో టిడిపి జెండా దిమ్మెను తొలగించిన అంశంపై ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రంగా స్పందించారు. అసలు అక్కడ కార్పొరేటర్ కుమారుడికి ఏం పని ఉందని ప్రశ్నించారు. పైగా సోషల్ మీడియాలో రప్పా..రప్పా..అంటూ కామెంట్ పెడతారా అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేస్తే 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే అనంత వెంకట్రామిరెడ్డి తమ కార్యకర్తలను రెచ్చగొట్టి స్టేషన్‌పైకి పంపించారన్నారు. అక్కడ వైసిపి నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఒక వీధి రౌడీల్లా పోలీసులపై దూషణలకు దిగారన్నారు. అసలు పోలీసులపై దౌర్జన్యం ఎలా చేస్తారని ఆయన నిలదీశారు. తాము అక్రమ కేసులు పెట్టి ఉంటే ఒక్క వైసీపీ నాయకుడు కూడా ఇప్పుడు ఇలా రోడ్ల మీదకు వచ్చి మాట్లాడేవారు కాదన్నారు. మేము మీ లాగా రౌడీయిజం చేయాలనుకుంటే ఒక్క క్షణం పట్టదని.. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా ఉండకూడదని.. రాష్ట్రంలో ఒక ప్రశాంతమైన వాతావరణం ఉండాలని సూచిస్తున్నారన్నారు.

నారాయణపురం భూమి వివాదంలో వాస్తవాలు ఇవే..

నారాయణపురం పంచాయతీలో భూమి కబ్జా అంటూ వస్తున్న వార్తల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి క్లారిటీ ఇచ్చారు.. వాస్తవంగా అక్కడ 2006లోని వెంచర్ వేశారని అప్పట్లో కొంత స్థలాన్ని పంచాయతీకి కేటాయించారని.. ఇందుకు సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే నివేదిక కోరామని చెప్పారు. వీఆర్వో తో పాటు పంచాయతీ అధికారులు కూడా దీనిపై స్పష్టత ఇచ్చారన్నారు. 2006 లోనే పంచాయతీకి భూమి కేటాయించగా అందులో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకానీ ఇక్కడ ఎవరు భూమిని ఆక్రమించలేదని.. దీనిపై అధికారులు కూడా పూర్తి స్పష్టతతో ఉన్నారన్నారు.

బీటెక్ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబర్‌లో నిర్వహించిన బీటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, బీటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ, బీటెక్ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్, ఎం.అంకారావు, తదితరులు తెలిపారు.

గ్రామ కమిటీల నిర్మాణంతోనే బలోపేతం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామస్థాయిలో కమిటీల నిర్మాణం జరిగితేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో పార్టీని బలపరిచి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పిటిసి భాస్కర్, పూల నారాయణస్వామి, సర్పంచు పార్వతి, చికెన్ నారాయణస్వామి, ఎస్సీ సెల్ నాయకులు వడియంపేట అంజి, కాటమయ్య, గంగరాజు, మండల కన్వీనర్లు, అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరమ్మ సేవలు మరువలేనివి..

కలెక్టర్ ఓ.ఆనంద్

ఉమామహేశ్వరమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సాయంత్రం పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకి ఆత్మీయ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ జిల్లాలో తాను పనిచేసిన రెండు మూడు నెలల్లో బాగా పని చేశారని పేర్కొన్నారు. ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలో జిల్లా వ్యవసాయ అధికారిగా చాలా ప్రశాంతంగా పని చేశారన్నారు. ప్రభుత్వ సేవలో 34 ఏళ్ల పని చేశారని, పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తనకు సహకారం అందించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ దంపతులను జిల్లా కలెక్టర్, తదితరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, ఆత్మ పిడి పద్మలత, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుమ్ముద, ఎడిఏలు అల్తాఫ్ అలీ ఖాన్, ఎమ్.రవి, పద్మజ, సత్యనారాయణ, వెంకట్రాముడు, వ్యవసాయ శాఖ అధికారులు వెంకటకుమార్, వాసుప్రకాష్, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసంఘాల అభివృద్ధే లక్ష్యం : ఎపిఎం

ప్రజాశక్తి-కుందుర్పి

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం సర్దానప్ప

గ్రామసంఘాలను అభివృద్ధి చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎపిఎం సర్దానప్ప తెలిపారు. మంగళవారం స్థానిక అమ్మ మండల సమైక్య కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు నీలాబాయి ఆధ్వర్యంలో ఈనారి, సిఆర్‌పిలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సంఘం సభ్యుల జీవనోపాదులు, ఆర్థిక ప్రగతి పెంపుదల చేసుకునేందుకు ప్రతి 10 సంఘాల కోసం ఒక ఈనారిని నియమిస్తున్నట్లు తెలిపారు. విఒలో 25 సంఘాలలోపు ఉంటే ఈనారి ఇద్దరి మాత్రమే ఎంపిక చేయాలన్నారు. అలాగే విఒలో అదనంగా ఇద్దరు జీవనోపాదులకు సంబంధించి సిఆర్‌పిని సెలెక్ట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవో లీడర్లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

మాట్లాడుతున్న మోహన్‌నాయక్

ప్రభుత్వ వసతి గహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదన్నారు. మెనూను పాటించడం లేదన్నారు. విద్యార్థులకు ఆదివారం బిర్యాని, గోంగూర పెరుగు పచ్చడి ఇవ్వాలని ఉండగా నాసిరకమైన చికెన్ ఇస్తున్నారని చెప్పారు. ఇటీవల ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి ప్రభుత్వ పాఠశాలలు వసతి గహాలను తనిఖీ చేపట్టినప్పటికీ అక్కడ తీరు మాత్రం మారడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాయనమైన భోజనాన్ని ఇవ్వాలన్నారు. అలాగే మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, మణికంఠ, చంటి, అశోక్, రమేష్, రామకృష్ణ, ధర్మకుమార్, అశోక్, రాజశేఖర్, రమణ, అంజి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-గుంతకల్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం పట్టణంలోని రాజేందర్ నగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూలతో అలంకరణలు చేశారు. మూడు గంటల నుంచి భక్తులు ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకోవడానికి బారులుదీరారు. ఆలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కోదండరామ స్వామి ఆలయంలో కూడా భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కసాపురం గ్రామంలోని లక్ష్మీ నారాయణస్వామి రాతి ఆలయంలో భక్తులు వైకుంఠ ఉత్తర ద్వారంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

రీ సర్వేకు సహకరించండి : తహాశీల్దార్

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రైతులు రీసర్వేకు సహకరించి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహాశీల్దార్ శేషారెడ్డి కోరారు. ఈనెల 2వతేదీ నుంచి మండలంలోని చీలేపల్లి, ఆనందరావుపేట గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వే నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభల్లో తహాశీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో అధికారులకు రైతులు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మీకు కేటాయించిన తేదీల్లో అధికారులు సర్వేకు వచ్చినప్పుడు భూములకు సంబంధించిన పత్రాలను సమర్పించాలన్నారు. అంతేగాకుండా ప్రతి రైతు తప్పనిసరిగా అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్ నారాయణస్వామి, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, విఆర్‌ఒలు, స్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన : ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెట్టే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్నారని చెప్పారు. కదిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వం హితోదికంగా సాయం అందిస్తోందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని తెలియజేశారు.

సాగునీరివ్వడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలోని రైతులకు సాగునీరు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున విమర్శించారు. మంగళవారం మండలంలోని చింతకుంట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువుకు నిదర్శనమైన అనంతపురం జిల్లాలో ప్రాజెక్టులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యల్లనూరు, పుట్లూరు మండలాలకు నీరు అందించే సుబ్బరాయ సాగర్‌కు నీరు సమృద్ధిగా చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.నారాయణస్వామి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు విటి.రామాంజనేయులు, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, పుట్లూరు మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, మండల గౌరవాధ్యక్షులు టి.బాల గురయ్య, ఉపాధ్యక్షుడు బూసగాని చిన్ని కష్ణ యాదవ్, చిన్న కులాయప్ప, పూలరంగడు, వీరయ్య, ఓబుల్ రెడ్డి, నాగయ్య, చిన్న ఓబులయ్య, పెద్దఓబులయ్య, నరసింహుడు వెంకట రాముడు, అజయ్, కుల్లాయప్ప, రామకష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘం సభ్యులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని స్వయం సహాయ సంఘంలోని మహిళలకు అర్బన్ హెల్త్ మిషన్ (ఎన్‌యుహెచ్‌ఎం) మద్దతుతో ఎంఇపిఎంఎ 'సఖి సురక్ష' కింద మంగళవారం స్థానిక మారుతీనగర్‌లో ఉన్న కమ్యూనిటీ రీసోర్స్ సెంటర్‌లో ఉచితంగా 16 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, మెప్మా సిబ్బంది, స్లమ్ సమాఖ్య రీసోర్స్‌పర్సన్లు, స్లమ్ సమాఖ్య లీడర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాల దిగుబడిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పాల దిగుబడిపై పశు పోషకుల్లో అవగాహన కల్పించాలని బుక్కరాయసముద్రం ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు ఎవి.రత్నకుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో పశు సంవర్థక శాఖ సబ్ డివిజినల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న పాల దిగుబడి పోటీలపై రైతులకు వివరించాలన్నారు. తమ పరిధిలోని బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లోని పశు పోషకుల్లో పాల దిగుబడి పోటీల్లో పాల్గొనేందుకు తగి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు గోవిందరాజు, శ్వేత, సాయిసుప్రజ, పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చక్రపాణి మంగళవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు బ్రాహ్మణపల్లికి చేరుకుని చక్రపాణి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు చిన్న నాయుడు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. బండ్లపల్లి పంచాయతీ నారాయణపురం బైరాపురం పంచాయతీ సాయి నగర్ క్రాసు, గౌనుకుంటపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

'పది' విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రతి పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తుంది. అందులో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుంది. దీని వల్ల సి, బి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణత పెంచడమే కాకుండా ఎ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటు న్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పాపసానపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణ ఉపాధ్యాయులతో కలిసి ప్రతిరోజూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మీ వంతు సహకారం ఇవ్వాలని కోరుతున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం కదిరేపల్లి, ఉగ్రేపల్లి, కంబాలపల్లి, కోడిగానపల్లి, కోతులగుట్ట, పాపసానపల్లి, తదితర గ్రామాలకు వెళ్లి మీ పిల్లలు సమయం వృథా చేయకుండా ఇంటి వద్ద బాగా చదివించాలని తల్లిదండ్రులను కోరు తున్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా టాటా హాజీవలి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా టాటా హాజీవలి నియమితులయ్యారు. పట్టణానికి చెందిన హాజీవలి పార్టీపై అభిమానంతో నిబద్ధత కలిగిన కార్యకర్తగా కొనసాగారు. అంతేగాకుండా గత వైసిపి ప్రభుత్వంలో అనేక అక్రమ కేసులు, దాడులను ఎదుర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించింది. దీంతో తన నియామకానికి సహకరించిన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుత్తికోటపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి కోటను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వానికి తగదని గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక గుత్తికోట వద్ద గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట గ్రామం నుంచి గుత్తికోటపైకి రహదారిని నిర్మించాలన్నారు. కోటలో విద్యుత్తు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గుత్తి కోటకు రోప్ వే నిర్మించాలన్నారు. గుత్తి కోటకు సౌకర్యాలను కల్పిస్తే పర్యాటకులు పెరుగుతారన్నారు. గుత్తికోటలో పురాతన ఆలయాలు, కట్టడాలను స్వార్థపరులు ధ్వంసం చేశారని, వాటిని పునర్నిర్మించాలన్నారు. కోట వద్ద హరిత హెూటల్, పార్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుత్తికోటను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కాశీరావు కన్వీనర్ కోటేశ్వరరావు, నాయకులు సతీష్, విజయ్, నిఖిల్, సుధాకర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల పరిధిలోని మీర్జాపురం గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు కుమారుడు చరణ్(15) తలమర్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివేవాడు. గత సోమవారం చరణ్ పాఠశాల సమీపంలో బహిర్భూమికి వెళ్లి అక్కడే ఉన్న ఓ బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంట నే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్పందించి బావిలో పడిన విద్యార్థి చరణ్ మృతదేహాన్ని తక్షణం వెలికితీయాలని స్థానిక పోలీసులు, ప్రభుత్వ అధికారులకు సూచించారు. దీంతో పోలీసులు చరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ఆ విద్యార్థి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించగా వారు హాజరై విద్యార్థి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. విద్యార్థి ఇలా మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కన్నీటి పర్యంతమైన విద్యార్థి తల్లిదండ్రులు హనుమంతు, సాయమ్మను ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, తలమర్ల సింగిల్‌విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, శీన, సాలెక్కగారి శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, సూరి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నూతన క్యాలెండర్, డైరీని శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. రాబోయే కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ ప్రతిష్ట దేశవ్యాప్తంగా కీర్తించే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, రవివర్ధన్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్, జిల్లా మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ మధుసూదన్, యుటిఎఫ్ జిల్లా క్రీడల కమిటీ కన్వీనర్ ఆజమ్ బాషా, సిపిఎస్ సబ్ కమిటీ కో కన్వీనర్ సంతోష్, హేమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట